గురువారం 17 అక్టోబరు 2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/




విలేకరులు కావలెను

RNI NO T/TG/2024/1093

Cell : 7013794396

అతితక్కువ కాలంలో 65వేలకు పైగా రీడర్ల మనసు దోచుకున్న ఇయ్యాల్టి న్యూస్ లోకల్ 2 గ్లోబల్ ... ఈ పేపర్ డైలీ పత్రికలో పని చేయుటకు తెలంగాణ వ్యాప్తంగా విలేకరులు కావలెను. కనీస విద్యార్హత కలిగి జర్నలిజంపై ఆసక్తి, తెలుగులో టైప్ చేయగలవారై ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలతో పాటు అన్ని మండలాల వారిగా విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత.. ఆసక్తి ఉన్న వారు వెంటనే సంప్రదించండి.

OFFICE ADDRESS
RRR MEDIA, PATELNGAR, AMBARPET, HYD-500013
email id.ramannews9@gmail.com






గోల్డ్ షాపుల్లో స్టాక్ లేదా..? తులం బంగారం హామీపై కేటీఆర్ సెటైర్లు...

2లో



పది మంది భార్యలు, మరి కొందరు గర్ల్‌ఫ్రెండ్స్.. ఈ 'ప్రేమ' దొంగ యవ్వారం వింటే షాకే..

3లో



మూత్రం పోసి చపాతీలు పిసికిన పనిమనిషి.. సీసీ కెమెరాలో చూసి షాక్ అయిన యజమాని

3లో



ఇండియా అంటె ఇట్లుంటది మరి.. పాకిస్తాన్ గడ్డపైనే ఆ దేశానికి జైశంకర్ వార్నింగ్ ..?

3లో

# మహారాష్ట్ర ఎలక్షన్ల బీఆర్ఎస్ పోటీ చేస్తుందా..?

## రాజకీయ వర్గాల్లో సర్వత్రా చర్చ..

ఇయ్యాల్టిన్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: వచ్చే నెలలో జరుగబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటి చేయడంపై బీఆర్ఎస్ పార్టీ మౌనం పాటిస్తుంది. జాతీయస్థాయిలో ఎదగడం కోసమే పేరు మార్చుకున్న బీఆర్ఎస్ పార్టీ, సొంత రాష్ట్రంలో అధికారం కొల్పోపోవడంతో అంతర్ రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఉండనున్నట్లు తెలుస్తుంది. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి భారత రాష్ట్ర సమితిగా పార్టీగా పేరు మారింది. ఆ తర్వాత జాతీయ స్థాయిలో సత్తాచాటాలని మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిస్సా, బీహార్ రాష్ట్రాలలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ పర్యటించి అక్కడ కూడా పార్టీ శాఖలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఆయన మహారాష్ట్రపై ఎక్కువ దృష్టి పెట్టారు. నాగపూర్, సోలాపూర్, నాందేడ్ ప్రాంతాలలో పార్టీ కార్యాలయం కూడా ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో ఎన్సీపీ, కాంగ్రెస్, శివసేనల నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ మహారాష్ట్రలో 4



భారీ బహిరంగ సభలు నిర్వహించింది. మహారాష్ట్రలో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోయిన కానీ ప్రధాన పార్టీలకు ఎంతో కొంత పోటి ఇస్తుందని అంతా భావించారు. అప్పట్లో మహారాష్ట్ర నుంచి కొంతమందికి రాష్ట్ర ప్రభుత్వంలో పోర్ట్‌ఫోలియో ఉన్న బాధ్యతలు కూడా అప్పజెప్పారు. అదిలాబాద్ నిజామాబాద్ ఎమ్మెల్యేలకు నాందేడ్‌తో పాటు తెలంగాణకు ఆనుకొని ఉన్న మహారాష్ట్ర ప్రాంతాలకు ఇంఛార్జ్‌లుగా నియమించారు. ఇక అన్ని సిద్ధం చేసుకున్నా తర్వాత ఎన్నికల రంగంలోకి దూకడమే ఆలస్యం అనుకున్న సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ దెబ్బతినడంతో కేసిఆర్ వ్యూహాలు తలకిందులయ్యాయి. అప్పటి నుంచి ఆయా రాష్ట్రాల్లో ఉన్న శాఖల బాధ్యులు, నాయకులు ఒక్కొక్కరిగా రాజీనామా చేయడం మొదలుపెట్టారు. పార్టీ కార్యాలయాలకు కూడా రావడం లేదు. కేసీఆర్ కూడా ఇతర రాష్ట్రాల్లో రాజకీయాలపై దృష్టిపెట్టడం తాత్కాలికంగా ఆపివేసినట్లు చర్చ జరుగుతుంది.

తాజాగా మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అందరి దృష్టి మళ్లీ బీఆర్ఎస్‌పై పడింది. గతంలో హడావుడి చేసిన పార్టీ ఇప్పుడు ఎవరికైనా మద్దతిస్తుందా%ొ% లేక తెలంగాణ బోర్డర్‌లో ఉన్న నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందా%ొ% అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కానీ బీఆర్ఎస్ పార్టీ వైపు నుంచి మాత్రం ఎలాంటి సమాధానం రావడం లేదు. పూర్తిగా తెలంగాణపై దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీచేస్తుందా? లేదా అనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. జాతీయ రాజకీయాల్లో క్రియాశీలంగా రాణించాలని అనుకున్నా బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతానికి బ్రేక్ పడ్డట్లే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ముహూర్తం ఫిక్స్.. ప్రజా ఉద్యమాలకు బీజేపీ, బీఆర్ఎస్ ప్లాన్..!

## రంగంలోకి గులాబీ బాస్

ఇయ్యాల్టిన్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: అధికార కాంగ్రెస్‌పై పవర్ ఫుల్ ఫైట్‌కి సిద్ధమవుతున్నాయి ప్రతిపక్షాలు.. పక్కా ప్లాన్‌తో ప్రజాల్లోకి వెళ్లాలని డిసైడ్ అయ్యాయి. ఎన్నికల హామీలపై కాంగ్రెస్ తీరును ఎండగడుతూ నవంబర్‌లో ఉద్యమానికి కాషాయం పార్టీ సై అంటుంటే.. కాంగ్రెస్ వన్ ఇయర్ పాలనపై పోరాడుతామంటూ డిసెంబర్‌ను ఫిక్స్ చేసుకుంది బీఆర్ఎస్. మరోవైపుత ఎవరెలా వచ్చినా ఏం చేయలేరంటోంది అధికార కాంగ్రెస్. దీంతో తెలంగాణ పాలిటిక్స్ మరింత ఇంట్రెస్టింగ్‌గా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ నుంచి ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని క్లారిటీ ఇచ్చారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఒక్క ఇళ్లు కట్టలేదు. పేదలకు ఒక్క ఇళ్లు పంచలేదు. గ్యారంటీలు రోడ్డున పడ్డాయన్నారు. హామీల పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన ప్రతి హామీపైనా ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఇక డిసెంబర్‌తో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతుంది. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏం చేసింది? ఎన్ని గ్యారంటీలు అమలు చేసింది? ఎన్ని హామీలు నెరవేర్చింది? అంటూ బీఆర్ఎస్ సైతం ప్రభుత్వంపై ఫైట్‌కి



సిద్ధమవుతోంది. డిసెంబర్‌లోనే గులాబీ దళపతి రంగంలోకి దిగుతారన్న ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. రాష్ట్రంలో రాజకీయం రగులుతున్నా బయటకు రాలేదు కేసీఆర్. ఓవైపు రుణమాఫీ పాలిటిక్స్ మరోవైపు హైడ్రా మంటలు.. ఇంకోవైపు మూసీ ప్రక్షాళనపై రాజకీయం ఓ రేంజ్‌లో నడుస్తున్నా కేసీఆర్ బయటకు రావడం లేదు. ప్రభుత్వం వైఫల్యాలపై ఎలా ముందుకెళ్లాలో కూడా కేడర్‌కు దిశానిర్దేశం చేయలేదు. అంతేకాదు ఆ మధ్య తెలంగాణలో భారీ వరదలు ముంచెత్తిన సమయంలోనూ కేసీఆర్ జనం మధ్యకు రాలేదు. కౌశిక్‌రెడ్డి ఇష్యూ జరిగినా కేసీఆర్ మౌనం వీడలేదు. ఈవన్నీ అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావే మాట్లాడుతున్నారు. మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు జనంలోనే ఉంటున్నారు. కేసీఆర్ మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ప్రెస్‌నోట్లు కూడా ఇవ్వలేదు. దీంతో కేసీఆర్ ఎందుకు ప్రజల్లోకి రావట్లేదని రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అయితే ఇదే అంశాన్ని క్యాష్ చేసుకుంటోంది అధికార కాంగ్రెస్ పార్టీ. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం కావడంపై మంత్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో అధికార పార్టీ విమర్శలకు అదే స్థాయిలో కౌంటర్ ఇస్తూ వస్తోంది బీఆర్ఎస్. కేసీఆర్‌కి ఎప్పుడు ప్రజల్లోకి రావాలో తెలుసంటున్నారు గులాబీ నేతలు. ఇక ఇన్ని ఇష్యూస్ ఉన్నా కేసీఆర్ రియాక్ట్ కాకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయంటున్నారు కొందరు బీఆర్ఎస్ నేతలు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది సమయం ఇచ్చే ఆలోచనలో గులాబీ బాస్ ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరిగిన మేలేంటో..నష్టమేంటో ప్రజలకే అర్థం అవుతుందని కేసీఆర్ భావిస్తున్నారట. ఏడాది సమయం ఇచ్చి%ొ% ఇప్పుడు విమర్శించినా ప్రజలు రిసీవ్ చేసుకునే పరిస్థితి ఉండదని.. ఆలోపే ప్రభుత్వాన్ని టార్గెట్ చేయొద్దని గులాబీ బాస్ అనుకుంటున్నారట. మరి కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తైన తర్వాతైనా గులాబీ దళపతి ఫీల్డ్‌లోకి దిగుతారా..? లేదా అన్నది చర్చనీయాంశమైంది.మొత్తంగా%ొ% అటు బీజేపీ ఇటు బీఆర్ఎస్ రెండు పార్టీలు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డిసైడ్ అయ్యాయి. ఇలా ఇయర్ ఎండ్ పాలిటిక్స్ ఇంకెంత ఆసక్తికరంగా మారుతాయో చూడాలి మరి..

# బఫర్ జోన్‌లో మల్లయ్య ఇల్లు ఉండకూడదట..!

## కానీ ఆ ఇల్లు తీసేసి మాల్ కట్టొచ్చట..!! రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సెటైర్లు

ఇయ్యాల్టిన్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: బఫర్ జోన్‌లో మల్లయ్య ఇల్లు ఉండకూడదట.. కానీ ఇల్లు తీసేసి మాల్ కట్టొచ్చట.. అదేం లాజిక్ అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. మల్లయ్య ఇంట్లో నుంచి మురికి నీరు వస్తది.. కానీ మాల్‌లో నుంచి సుగంధ ద్రవ్యం వస్తదా..? ఈ ద్వంద్వ వైఖరి ఏంటి..? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ



భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలకు మీరే కదా అనుతులు ఇచ్చింది. రిజిస్ట్రేషన్లు చేసింది మీరే కదా..! ఇప్పుడు వాటిని కూలగొడితే రిజిస్ట్రేషన్ డబ్బులు రేవంత్ రెడ్డి తిరిగి ఇస్తాడా..? జీవో ఇచ్చాం పోండి అంటే ఎలా..? ఏ చర్చ లేకుండా, అనాలోచితంగా చేస్తామంటే ప్రజలు ఊరుకోరు. మూసీ పరివాహక ప్రాంతానికి రా.. వాళ్ల ముందు పబ్లిక్ మీటింగ్ పెట్టి చెప్పు.. ఎలా మూసీ సుందరీకరణ చేస్తావు..? ఎలా అభివృద్ధి చేస్తావో చెప్పు..? ప్రజలను ఒప్పించి మెప్పించు అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు.

# ఒవైసీ, మల్లారెడ్డి కాలేజీల కూల్చివేతలపై క్లారిటీ

ఇయ్యాల్టిన్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: హైడ్రా పై కేటీఆర్ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ, చేయిస్తున్నాడని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రా మీద తప్పుడు ప్రచారం చేయించేందుకే కేటీఆర్ కొన్ని యూట్యూబ్ ఛానళ్లకు డబ్బులు ఇచ్చారని కీలక ఆరోపణలు చేశారు. ఒవైసీ, మల్లారెడ్డి , మర్రి



రాజశేఖర్ రెడ్డి ల విద్యాసంస్థలకు సీఎం రేవంత్ రెడ్డి సమయం ఇచ్చారని తెలిపారు. కేవలం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొనే సమయం ఇచ్చారని అన్నారు. అకాడమిక్ ఇయర్ పూర్తయ్యాక కూల్చివేతలు ఉంటాయని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు కూల్చివేతలు ఉంటాయని అన్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చి పది నెలలే అయిందని తెలిపారు. ఎంఐఎంకు ప్రధాని నరేంద్ర మోదీ మద్దతు ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అందుకే ఔరంగాబాద్‌లో ఎంఐఎం నేతకు రెడ్ కార్పెట్ పరిచారని అన్నారు.

## గ్రేటర్ ఎన్నికలే టార్గెట్.. పార్టీ నేతలకు

## టీపీసీసీ చీఫ్ ఆల్టిమేటం

ఇయ్యాల్టిన్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలతో రెండో రోజు సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలపై క్షుణ్ణంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో గెలిచేందుకు కృషి చేయాలని పార్టీ నేతలకు మహేష్ కుమార్ గౌడ్ ఆల్టిమేటం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథం, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ–టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, సమీరుల్లా, కార్పొరేషన్ చైర్మన్‌లు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ..

## కౌన్ బనేగా మినిస్టర్.. రేసులో ఉన్నది ఎవరంటే..?

ఇయ్యాల్టిన్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: గత డిసెంబరులో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ఆ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మరో 11 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ త్వరాత మంత్రి వర్గ విస్తరణ త్వరలో జరుగుతుందని గత కొన్ని నెలలుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ జమ్ము కశ్మీర్, హర్యానా ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు ఎన్నికల బిజీలో




ఉండిపోయారు. దాంతో వారు రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణను పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఆ రాష్ట్రాల ఎన్నికలు పూర్తవడంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. ఇటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సహా ముఖ్య నేతలు కూడా ఢిల్లీ వెళ్లడంతో కేబినెట్ విస్తరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొననున్న రేవంత్‌రెడ్డి.. కేబినెట్ విస్తరణపై హైకమాండ్‌తో చర్చించనున్నట్లు తెలుస్తోంది. మరో నలుగురికి కేబినెట్‌లో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోందని ఈసారి విస్తరణలో ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం ఊపందుకుంది. దీంతో కేబినెట్ విస్తరణపై ఆశావహుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. తాజాగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలతో కేబినెట్ విస్తరణ ఇక ఎంతో దూరంలో లేదన్నది స్పష్టమైంది.

కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలతో ఆశావహులు అలర్టయ్యారు. మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు ప్రచారం జరుగుతుండడంతో వారి ప్రయత్నాలు మరింత ముమ్మరం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ నాయకుడు ప్రేమ్ సాగర్ రావుతో పాటు, వివేక్, వినోద్ సోదరులు రేసులో ఉన్నారు. దీంతో ముందే వారికి చెక్ పెట్టేందుకు సీనియర్ కాంగ్రెస్ నేతగా మంత్రి పదవి ఆశిస్తున్నానని మీడియా ముందు కుండబద్దలు కొట్టారు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు. అయితే మంత్రి పదవి ఎవరికివ్వాలనేది అధిష్ఠానం చూసుకుంటుందని హైకమాండ్‌పై తన విధేయతను కూడా తెలియజేశారు.

ఇటు ప్రేమ్ సాగర్ రావుకి కౌంటర్‌గా వివేక్, వినోద్ సోదరులు ఢిల్లీ స్థాయిలో మంత్రి పదవి కోసం ఎవరికి వారు లాబీయింగ్ చేస్తున్నారు. ఇప్పటికే వివేక్ తనయుడికి పెద్దపల్లి ఎంపీగా అవకాశం రావడంతో కాకా ఫ్యామిలీ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని వినోద్ నేరుగా సోనియాగాంధీ స్థాయిలోనే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తనని కాకా ఫ్యామిలీ కోటాలో పరిగణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల కాకా వెంకటస్వామి జయంతి వేడుకలో చెప్పటం.. అయితే మంత్రి వర్గ విస్తరణలో కాకా ఫ్యామిలీ కోటా అయిపోయిందని సీఎం రేవంత్ చమత్కరించడం జరిగింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి గెలిచిన సీనియర్ నాయకుల్లో మాజీ మంత్రి ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంత్రి వర్గవిస్తరణలో ముందు వరుసలో ఉన్నారు. ఈ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలలో సుదర్శన్ రెడ్డి సీనియర్ కావడంతో పాటు వై.యస్ హయాంలోనే మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండటంతో ఆయనకు పోటీ పెద్దగా లేకపోవడం కలిసి వస్తోంది. మొత్తానికి ఈ సారి కేబినెట్ విస్తరణ జరుగుతుందని బలమైన సంకేతాలు వస్తున్న నేపథ్యంలో అమాత్య యోగం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

# హైడ్రాకు హైకోర్టులో భారీ రిలీఫ్..

ఇయ్యాల్టిన్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: హైడ్రాకు హైకోర్టు లో ఊరట లభించింది. హైడ్రా ఏర్పాటును తప్పుపట్టలేమని స్పష్టం చేసింది. హైడ్రాను ఏర్పాటు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తేల్చి చెప్పింది. హైడ్రా ఏర్పాటు జీవో నెంబర్.99, హైడ్రా చర్యలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. ప్రభుత్వ



స్థలాలు, చెరువుల పరిరక్షణ నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా చట్టవిరుద్ధమెలా అవుతుందని పిటిషనర్లను హైకోర్టు ప్రశ్నించింది. హైడ్రా చట్టవిరుద్ధంగా చర్యలు చేపడితే వాటిని ప్రశ్నించే అధికారం ఉంటుంది తప్ప ఏర్పాటునే ఎలా ప్రశ్నిస్తారంది. ఒకవేళ చట్టవిరుద్ధంగా ప్రైవేటు ఆస్తుల్లోకి చొరబడినా, ఆస్తులను కూల్చివేసినా నష్టపరిహారం కోరుతూ కింది కోర్టుల్లో పిటిషన్‌లు దాఖలు చేసుకోవచ్చని పేర్కొంది. అంతేకాకుండా కూల్చివేతలకు సంబంధించి చట్టప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఇదే హైకోర్టు ఆదేశాలిచ్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

# ఐఏఎస్‌లకు తెలంగాణ హైకోర్టు షాక్..

## ముందు వెళ్లి రిపోర్ట్ చేయాలని ఆర్డర్స్...

ఇయ్యాల్టిన్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: క్యాట్ తీర్పును వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించిన ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టు షాకిచ్చింది. ఇలాంటి విషయాల్లో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. సివిల్ సర్వెంట్ల నియామకాలను కోర్టులు నిర్ధారించలేవని జడ్జి పేర్కొన్నారు. ఐఏఎస్‌లు అయినంత మాత్రాన స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఇలాంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ముగింపు ఉండదని అభిప్రాయపడింది. ముందు వెళ్లి ఎక్కడివాళ్లు అక్కడ రిపోర్ట్ చేయాలని



ఆదేశాలు జారీ చేసింది. కాగా, క్యాట్ తీర్పు ప్రకారం ఇవాళే రిపోర్ట్ చేయాల్సి ఉంది.కాగా, ఇటీవల డీవోపీటీ బదిలీ చేసిన ఐఏఎస్ అధికారులు తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. రొనాల్డ్ రోస్, సృజన, శివశంకర్, హరికిరణ్, ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్.. డీవోపీటీ ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల వీరంతా తమను యథావిధిగా బదిలీ చేయకుండా ఉంచాలని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్) ఆశ్రయించారు. వారి విజ్ఞప్తిని అక్కడ నిరాకరించడంతో తాజాగా బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు విచారణ చేపట్టి.. ముందు వెళ్లి రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

హైదరాబాద్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్ నగర్, జనరల్

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

## తెలంగాణలో రాగల ఐదురోజులు వర్షాలు..




ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: తెలంగాణలో మరో ఐదురోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 21 వరకు పలు జిల్లాల్లో వానలు కురుస్తాయని వెల్లడించింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతుందని చెప్పింది. ప్రస్తుతం బంగాళాఖాతం చెన్నైకి తూర్పు-ఆగ్నేయంగా 320 కిలోమీటర్లు, ఏపీలోని నెల్లూరుకు 400 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని చెప్పింది. పశ్చిమ-వాయువ్య దిశగా పయనిస్తూ ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల మధ్యనున్న పుదుచ్చేరి, నెల్లూరు మధ్య గురువారం తెల్లవారు జామున చెన్నైకి దగ్గరలో తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఇక రాష్ట్రంలో బుధవారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు కురిసేందుకు అవకాశం ఉందని ప్రకటించింది. శుక్రవారం ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు పలుచోట్ల వర్షాలు కురిసేందుకు అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.



## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం.. నూతన పారిశ్రామికాభివృద్ధి పాలసీకి ఆమోదం





ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, అక్టోబర్ 16: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ భేటీ జరిగింది.

అయితే, మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట, అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టడం, రీహాబిలిటేషన్ పై మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఇక, రాష్ట్రంలో పునరుద్పాదక విద్యుత్, పంప్డ్ స్టోరేజీ ద్వారా విద్యుత్ ఉత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ లాంటి వనరుల వినియోగం పెంచేలా ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే, 2024-29 రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి పాలసీ 4.0పై చర్చించిన మంత్రివర్గం ఆమోదించింది. దీంతో పాటు 20 లక్షల ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా పారిశ్రామిక పాలసీ, పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసే విధంగా పారిశ్రామిక పాలసీ ఉండాలని కాబినెట్ నిర్ణయించింది. ఇక, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ పైనా రాష్ట్ర మంత్రివర్గంలో చర్చ జరిగింది.. 2030 నాటికి ఇంటింటికీ ఓ పారిశ్రామిక వేత్త అనే అంశంతో నూతన ఎంఎస్ఎంఈ పాలసీకి చంద్రబాబు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. అలాగే, రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్ని ప్రోత్సహించేలా కొత్త పాలసీపై మంత్రివర్గంలో చర్చించి ఆమోదం తెలిపారు. మల్లవెల్లి పారిశ్రామిక పార్కులో 349 మందికి భూ కేటాయింపులపై నిర్ణయం.. డ్రగ్స్ నియంత్రణ, ధరల నియంత్రణ, ఉద్యోగాల కల్పనపై మంత్రుల కమిటీల నియామకంపైనా సుదీర్ఘంగా కేబినెట్ లో చర్చించారు. మూడు క్యాబినెట్ సబ్ కమిటీలకు ఆమోదం లభించింది. .

## గోల్డ్ షాపుల్లో స్టాక్ లేదా..?

### తులం బంగారం హామీపై కేటీఆర్ సెటైర్లు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16:కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద ప్రతి ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. ఈ పది నెలల కాలంలో వేల సంఖ్యలో వివాహాలు జరగ్గా.. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా తులం బంగారం ఇవ్వలేదు. రాబోయే రోజుల్లో లక్షలాది పెళ్లిళ్లు జరగబోతున్నాయి.. మరి తులం బంగారం మాట ఏంటని రేవంత్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై కేటీఆర్ ఎక్స్ వేదికగా రేవంత్‌ను నిలదీశారు.లక్షలాది లగ్గాలు జరిగే మ్యారేజ్ సీజన్ మళ్లా వచ్చింది.. ఈ సారి కూడా తులం బంగారం తూచ్ తూచేనా ముఖ్యమంత్రి..? అని కేటీఆర్ ప్రశ్నించారు. శుభ ముహుర్తాలతో పెళ్లి సందడి మొదలైంది.. మరి మీ కల్యాణమస్తు కానుక అమలుకు సుముహూర్తం దొరకట్లేదా..? పది గ్రాముల పసిడి ఆశజూపి ఆడబిడ్డల ఓట్లు వేయించుకున్నావ్.. ఆడిన మాట తప్పి పచ్చని పందిళ్ల సాక్షిగా పచ్చి దగా చేస్తున్నావ్..! అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు ఇదే: హరీశ్ రావు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16:తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు... ఉన్న పథకాలు నిలిపివేయడమేనని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి రూ.5 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో చెప్పిన ప్రభుత్వం... ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. వెంటనే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారమహిళలకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తానన్న రేవంత్ రెడ్డి ఒక్కటి కూడా ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. రూ.15 వేలు రైతుబంధు ఇస్తానని చెప్పి గుండుసున్నా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కంటే మంచి కిట్ ఇస్తానని చెప్పి పేద గర్భిణీలను మోసం చేశాడని ధ్వజమెత్తారు. ఆగస్ట్‌లోనే వేయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చినా వేయలేదని మండిపడ్డారు. చేప పిల్లలకు బడ్జెట్ కూడా కేవలం రూ.16 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు.ముఖ్య నేతల కోసం ఓఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారని హరీశ్ రావు ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంతమంది నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. దక్షిణ భాగాన్ని కేంద్రం నిర్మించాలని, కానీ కావాలనే రాష్ట్ర ప్రభుత్వం తాము నిర్మిస్తామని చెబుతోందన్నారు.

## శ్రీవారి భక్తులకు అలర్ట్..

### జనవరి నెల శ్రీవారి దర్శన టికెట్లు విడుదల ఎప్పుడంటే..?



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, అక్టోబర్ 16: తిరుమల వెళ్లే ప్లానింగ్‌లో ఉన్న వారికి అదిరే గుడ్ న్యూస్. ఏంటని అనుకుంటున్నారా.. శ్రీవారి దర్శన టికెట్ల బుకింగ్‌కు రెడీగా ఉండండి. జనవరి నెల టికెట్లు విడుదల కానున్నాయి. అందువల్ల మీరు జనవరి నెలలో కొండకు వెళ్లాలని చూస్తే.. మాత్రం టికెట్లు విడుదల అయిన వెంటనే బుక్ చేసుకోవడం ఉత్తమం. ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో జనవరి నెలకు సంభందించిన దర్శన టిక్కెట్లు విడుదల చేయనుంది తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ).. మీరు తిరుమల వెళ్లాలని అనుకుంటే మాత్రం ఈ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. ఎందుకంటే ఈ టికెట్లు అలా వచ్చి ఇలా అయిపోతాయి. అంత ఫాస్ట్‌గా బుక్ చేసుకుంటారు. 19వ తేదీ నుంచి 21వ తేదీ ఉదయం వరకు లక్కీ డిఫ్ విధానంలో కేటాయించే ఆర్జిత సేవా టిక్కెట్లు విడుదల చేయనున్నారు.22వ తేదీ ఉదయం 10 గంటలకు కళ్యాణోత్సవం, ఉంజల్ సేవా, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవా టిక్కెట్లను టీటీడీ విడుదల చేయనుంది. అలాగే.. మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవా టిక్కెట్లు విడుదల చేయనుంది. 23వ తేదీ ఉదయం 10 గంటలకు అంగప్రదక్షణ దర్శన టోకేన్లు విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు శ్రీవాణి దర్శన టిక్కెట్లు విడుదల చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, వికలాంగుల దర్శన టిక్కెట్లు విడుదల చేయనుంది టీటీడీ. 24వ తేదీ ఉదయం 10 గంటలకు 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు వసతి గదులు కోటా విడుదల చేయనుంది టీటీడీ.

## హామీల గురించి నీతులు చెప్పడం.. దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంది: మంత్రి సీతక్క



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: మంత్రి సీతక్క తాజాగా సోషల్ మీడియాలో గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. ఇందులో భాగంగా.. తొమ్మిదన్నరేళ్లలో మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితిని తీసుకొచ్చారని, అప్పుల వారసత్వానికి ఆద్యులే మీరేనని ఆవిడా అన్నారు. మీ హయాంలో అక్షరాల రూ. 7 లక్షల కోట్ల అప్పులు చేసారని, వాటికి కిస్తీలు, వడ్డీల కోసం ప్రతి రోజు టంచన్గా రూ.207 కోట్లు చెల్లించాల్సి వస్తోందని, అంటే.. ప్రతి నెల సగటున 6 వేల కోట్ల ప్రజాధనాన్ని మీ అప్పుల కుప్పను కడగడానికే సరిపోతుందని తెలిపారు. అప్పుల అప్పారావు లాగా అందిన కాడల్లా అప్పులు చేసి.. రాష్ట్రాన్ని తిప్పలు పెట్టి, వడ్డీలతో ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచిన మిమ్మల్ని దేనితో కొట్టాలంటూ కాస్త గట్టిగానే రాసుకొచ్చారు. అప్పులు చాలవన్నట్లు వేల కోట్ల బకాయిలను మీరు చెల్లించలేదని, చేసిన పనులకూ బిల్లులు చెల్లించలేందంటూ ధ్య బట్టారు. 5 వేల కోట్ల ఫీ రియంబర్స్మెంట్ బకాయిలు, ఆరోగ్య శ్రీ బకాయిలు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు, సర్పంచులకు పెండింగ్ బకాయిలు, విద్యుత్ సంస్థలకు బకాయిలు, ఆర్టీసీకి బకాయిలు, గురుకుల భవనాల ఓనర్లకు అద్దె బకాయిలు, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిధుల పెండింగ్.. ఇలా ప్రతి శాఖలో వందల కోట్ల బకాయిలు పెట్టి ఇప్పుడు బుకాయిస్తే ఏలా అంటూ మంత్రి రాసుకొచ్చారు.



## కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీల్లో తేజస్వినికి ఫస్ట్ ప్రైజ్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, అక్టోబర్ 16: హైదరాబాద్ జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు బుధవారం బన్సీలాల్ పేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హియామత్ నగర్ జోన్ డిప్యూటీ ఈవో విజయ లక్ష్మి , అధికారులు కస్తూరి కుమారి, స్వప్న, హెచ్ఎం నారాయణ రెడ్డి , సెక్టోరల్ ఆఫీసర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. కాగా.. కాగా క్లాసికల్ డ్యాన్స్ పోటీలో తేజస్విని మొదటి బహుమతి పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు డిసెంబర్ నెలలో నిర్వహించే రాష్ట్ర స్తాయి పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు

## గుంతలో పడి గాల్లోకి ఎగిరిన కారు ..మెదక్ జిల్లాలో ఏడుగురు దుర్మరణం



ఇయ్యాల్టి న్యూస్, మెదక్, అక్టోబర్ 16:మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం ఏడుగురిని బలితీసుకుంది. జిల్లాలోని శివంపేట మండలం ఉసిరికపల్లి వద్ద రోడ్డుపై ఉన్న గుంత వారి పాలిట మృత్యువుగా మారింది. రహదారిపై ఉన్న గుంతను గమనించకపోవడంతో కారు అదుపుతప్పి గాల్లోకి లేచింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఏడుగురు అక్కడికక్కడే చనిపోయారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు ఉన్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి మాత్రమే గాయలతో బయటపడ్డాడు. ప్రమాద సమయంలో కారు వేగంగా వెళు న్నట్లు తెలుస్తోంది. గుంతలో కారు పడి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో ఎవరూ ప్రాణాలతో బయటపడే అవకాశం కనిపించలేదు. ప్రమాదం గురించి తెలిసిన స్థానికులు కాలువలోకి దూసుకెళ్లిన కారును బయటకు తీసుకొచ్చారు. అప్పటికే కారులోనే ఏడుగురు చనిపోయారు.



## తల్లిని అనుభవించాలన్న కోరికతో.. బాలిక కిడ్నాప్ హత్య..

ఇయ్యాల్టి న్యూస్, క్రైం, అక్టోబర్ 16: హైదరాబాద్ లోని సూరారంలో తల్లిని అనుభవించాలన్న కోరికతో ఆమె కూతురిని హత్య చేసిన ఘటనలో 'తిరుపతి' అనే యువకుడిని అరెస్ట్ చేసారు పోలీసులు. బాలికని హత్య చేస్తే తల్లిని అనుభవించవచ్చునని కోరికతో హత్య చేసినట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా మరణించిన బాలిక మరొక సోదరితో పాటు సహజీవనం చేస్తున్న యువకుడ్ని కూడా చంపాలని ప్లాన్ చేసాడని, అలా చేస్తే బాలిక తల్లికి ఎవరు లేకపోతే తన దగ్గరకు వస్తుందని తిరుపతి ఆశించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా బాలిక తల్లి కోసం ఏకంగా ముగ్గురిని చంపేందుకు ప్లాన్ చేసాడు తిరుపతి. ముందుగా ఏడేళ్ల బాలికను హత్య చేసి, ఆ తర్వాత మరో బాలికను హత్య చేయాలని ప్లాన్ చేసాడని తెలిపాడు. ఈ నేపథ్యంలోనే బాలికను కిడ్నాప్ చేసి కత్తితో గొంతు కోసి చంపాడు తిరుపతి. ఆపై బాలిక మృతి దేహంను గుర్తుపట్టకుండా ఉండేందుకే గోన సంచిలో కుక్కి పారిపోయాడు తిరుపతి. ఈ ఘటనలో ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికను కిడ్నాప్ చేసి హత్య చేసాడని అధికారులు తెలిపారు.

## కులగణన నిర్ణయంపై వీహెచ్ హర్షం..పూలే విగ్రహానికి పాలాభిషేకం



ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, అక్టోబర్ 16: కులగణన వెంటనే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు హర్షం వ్యక్తం చేశారు.

బుధవారం అంబర్ పేట అలీ కేఫ్ చౌరస్తాలో గల జ్యోతిరావుపూలే విగ్రహానికి పలు బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జ కృష్ణ , బాలరాజ్ గౌడ్, ఆర్ లక్ష్మణ్ యాదవ్ , శంభుల శ్రీకాంత్ గౌడ్ , పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్ , గరిగంటి రమేష్ , దిడ్డి రాంబాబు , పులి జగన్ , తొలుపునూరి కృష్ణాగౌడ్, అప్సర్, యూసుఫ్ జాయ్ , రామ్మోహన్ రావు , గడ్డం శ్రీధర్ గౌడ, కోటం అనిల్, షేక్ జమీర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

నేషనల్, ఇంటర్నేషనల్ , క్రైం, వైరల్ న్యూస్

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL


https://epaper.eyyaltynews.com/

గురువారం 17 అక్టోబరు 2024



# నష్టాల్లో ముగిసిన భారత స్టాక్ మార్కెట్

ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, అక్టోబర్ 16:భారత స్టాక్ మార్కెట్ బుధవారం నష్టాల్లో ముగిసింది. ఆటో, ఐటీ, పీఎస్‌యూ బ్యాంకుల స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవడంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 318 పాయింట్లు క్షీణించి 81,501 వద్ద ముగియగా... నిఫ్టీ 86 పాయింట్లు నష్టపోయి 24,971 వద్ద స్థిరపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 141 పాయింట్లు క్షీణించి 59,451 వద్ద ముగిసింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 2.85 పాయింట్లు లాభపడి 19,305 వద్ద స్థిరపడింది. నిఫ్టీ బ్యాంక్ 105 పాయింట్లు నష్టపోయి 51,801 వద్ద ముగిసింది.ఫిన్ సర్వీస్, రియల్టీ, ఎనర్జీ, ఇన్‌ఫ్రా, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు లాభపడగా, ఆటో, ఐటీ, పీఎస్‌యూ బ్యాంకులు, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగాలు భారీగా నష్టపోయాయి. బీఎస్ఈలో 2,030 షేర్లు లాభపడగా... 1,930 షేర్లు నష్టాల్లో ముగిశాయి. 108 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.



# పది మంది భార్యలు, మరి కొందరు గర్ల్‌ఫ్రెండ్స్..

## ఈ 'ప్రేమ' దొంగ యవ్వారం వింటే షాకే..



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 16: పది మంది భార్యలు, ఆరుగురు గర్ల్‌ఫ్రెండ్‌లు, జాగ్వార్ కారుని డ్రైవింగ్ చేయడం, విమానంలో ప్రయాణించడం, 5 స్టార్ హోటల్‌లో బస చేయడం ఇవన్నీ ఓ పెద్ద పారిశ్రామికవేత్తకు సంబంధించిన విషయాలు కావు. ఒక ఘరానా దొంగకు సంబంధించిన విషయాలు. అంతేకాదు ఈ దొంగ భార్యల్లో ఒకరు బీహార్‌లోని సీతామర్హిలో జిల్లా పంచాయతీ సభ్యురాలు. పొలిటికల్ లీడర్. మరో భార్య సినిమా హీరోయిన్. భోజ్‌పురి సినిమాల హీరోయిన్ నటిస్తుంది. ముంబైలో ఉంటుంది. నేరం చేసేందుకు వెళ్లే సిటీలో ముందుగా ఓ అమ్మాయిని ఇంప్రెస్ చేసి ఆ తర్వాత ఆ యువతిని పెళ్లి చేసుకోవడం ఈ దొంగ స్పెషాలిటీ.రెండేళ్ల క్రితం ఈ దొంగను ఘజియాబాద్‌లోని కవినగర్ కొత్వాలి పోలీసులు అరెస్టు చేశారు. ఈ దొంగ జాగ్వార్ కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కారు అతని భార్య పేరు మీద రిజిస్టర్ చేయబడింది. బీహార్‌లోని సీతామర్హికి చెందిన ఈ దొంగను మహ్మద్ ఇర్ఫాన్ అలియాస్ ఉజాలేగా గుర్తించారు. వాస్తవంగా ఈ దొంగ పెళ్ళిళ్ళు భార్యల గురించి చెప్పాలంటే.. ఉజాలేకు ఎంత మంది భార్యలు ఉన్నారో అతనికి కూడా ఖచ్చితంగా తెలియదు. అయితే పోలీసుల విచారణలో 10 మంది భార్యలు , ఆరుగురు ప్రియురాళ్ళు వెలుగులోకి వచ్చారు. పేర్ల జాబితా వెలుగులోకి వచ్చింది. ఎందుకంటే కొంత మంది గర్ల్‌ఫ్రెండ్స్ ను ఒక్కసారి తప్ప మళ్ళీ కలవలేదు.. ఎందుకంటే అతను ఎక్కడైనా నేరం చేయడానికి వెళ్తే.. అక్కడ ఓ అమ్మాయితో స్నేహం చేస్తాడు. ఆతర్వాత ఆ యువతి గురించి మరచి పోతాడు. ప్రపంచం దృష్టిలో మొహమ్మద్ ఇర్ఫాన్ దొంగ కావచ్చు.. అయితే అతడిని ఊరి ప్రజలు మాత్రం దేవుడిగా భావిస్తారు.మహ్మద్ ఇర్ఫాన్ ఎక్కడెక్కడో దొంగతనాలు చేసి అలా దోచుకున్న డబ్బులో ఎక్కువ భాగం తన ఊరి అభివృద్ధికే వెచ్చించాడు. గ్రామంలోని రోడ్లన్నీ బాగు చేశాడు. గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పించాడు. పలు అభివృద్ధి పనులు చేశాడు. ఇర్ఫాన్ భార్య మొదటిసారి ఎన్నికల్లో అప్రతిహతంగా విజయం సాధించడానికి.. ముఖ్యంగా రెండోసారి కూడా భారీ మెజార్టీతో గెలుపొందడానికి కారణం ఇదే. పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇర్ఫాన్ ఎప్పుడూ పెద్ద పెద్ద దొంగతనాలే చేసేవాడు.దొంగతనం చేయాలనుకున్న నగరంలో రెక్కీ నిర్వహించే వాడు. 10 రోజుల పాటు నగరంలోనే ఉండి విలాసవంతమైన ఇళ్లకు వెళ్లేవాడు. ఈ కాలంలో అవకాశం దొరికినప్పుడల్లా లక్షల కోట్ల విలువైన వస్తువులతో పరారీ అయ్యేవాడు. బీహార్ నుండి ఢిల్లీకి తన జాగ్వార్ కారులో ప్రయాణించేవాడు. ఎక్కువ దూరం అయితే విమానంలో ప్రయాణించేవాడు. సాధారణంగా అతను ఏ నగరానికి వెళ్లినా, అతను 5 స్టార్ హోటల్‌లో బస చేసేవాడు. మహ్మద్ ఇర్ఫాన్ మెరిసే బట్టలు ధరించడానికి ఇష్టపడేవాడు. పారిశ్రామికవేత్త ఆర్యన్ ఖన్నాగా తన గురించి పది మందికి చెప్పేవాడు.

# మూత్రం పోసి చపాతీలు పిసికిన పనిమనిషి..

## సీసీ కెమెరాలో చూసి షాక్ అయిన యజమాని



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 16: దేశ రాజధాని ఢిల్లీకి ఆనుకుని ఉన్న ఘజియాబాద్‌లో దారుణం చోటు చేసుకుంది. ఒక కాలనీలో ఆ ఇంటి పనిమనిషి మూత్రంతో పిండిని కలుపుతున్న వీడియో బయటపడింది. ఈ వీడియో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో రికార్డ్ అయింది. అక్కడ పనిమనిషి అసహ్యంగా ఆహారాన్ని వండి కుటుంబం మొత్తానికి తినిపించింది. వీడియో బయటపడిన తర్వాత వ్యాపారవేత్త క్రాసింగ్ రిపబ్లిక్ పోలీస్ స్టేషన్‌లో పనిమనిషిపై కేసు పెట్టాడు. నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. పనిమనిషి నేరాన్ని అంగీకరించింది. అయితే ఆమె ఎందుకు ఇలా ప్రవర్తిస్తుందో ఇంకా చెప్పలేదు.పనిమనిషి ఎనిమిదేళ్లుగా తన ఇంట్లో ఆహారం వండుతోందని బాధిత వ్యాపారి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపాడు. అతను తయారుచేసిన ఆహారం తిని అతని కుటుంబం కాలేయ వ్యాధితో బాధపడుతోంది. అయితే ఇప్పటి వరకు అతడిని ఎవరూ అనుమానించలేదు. ఈలోగా అతని ఇంట్లోని వంటగదిలో బంగాళదుంపలు, ఉల్లిపాయలు, టమోటాలు తదితరాలు దొంగిలించడం మొదలయ్యాయి. ఈ ఘటనలపై పనిమనిషిపై అనుమానం రావడంతో ఆమె వచ్చేలోపు మొబైల్ కెమెరా స్విచ్ ఆన్ చేసి వంటగదిలో దాచిపెట్టాడు. పనిమనిషి పని ముగించుకుని వెళ్లిన తర్వాత కెమెరాలో రికార్డయిన వీడియో చూశారు.వెంటనే వారి కళ్లు బైర్లుగమ్మాయి. వంటగదిలోకి ప్రవేశించిన కొద్దిసేపటికే పనిమనిషి పాత్రలో మూత్రం పోసి, అదే మూత్రంతో పిండిని పిసికి రోటీలు చేయడం స్పష్టంగా కనిపించింది. ఆ తర్వాత పిల్లలకు టిఫిన్‌లో ఈ రోటీలు ఇచ్చి, తినడానికి కూడా అక్కడే ఉంచాడు. వెళ్ళేటప్పటికి వంటగదిలోంచి టమాటాలు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు వగైరా పాలీథిన్ సంచిలో సర్దుకుని బట్టల్లో దాచుకుని అక్కడికి వెళ్ళింది. పనిమనిషి వెళ్లిన వెంటనే.. అతను వీడియోను చూసి, వెంటనే పాఠశాలకు వెళ్తున్న పిల్లలను పిలిచి, టిఫిన్ ఆహారాన్ని విసిరేయమన్నాడు.ఆ తర్వాత ఇంట్లో ఉంచిన ఆహారాన్ని కూడా పారేసి పోలీసులకు సమాచారం అందించాడు. వీడియో ఆధారంగా నిందితురాలిని పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. క్రాసింగ్ రిపబ్లిక్ పోలీస్ స్టేషన్ ప్రకారం.. మహిళ మొదట ఈ సంఘటన గురించి నాకేం తెలియదని బుకాయించింది. అయితే ఆమెకు వీడియో చూపించినప్పుడు అంగీకరించింది. అయితే దీనికి గల కారణాన్ని మాత్రం చెప్పలేదు. మరోవైపు, ఈ మహిళ తన మూత్రంతో చేసిన ఆహారాన్ని వారికి ఎంతకాలం తినిపించిందో తనకు తెలియదని వ్యాపారవేత్త చెప్పాడు. ఆమె చర్యల కారణంగా కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ కాలేయం దెబ్బతింది.

# జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఒమర్ అబ్దుల్లా..



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 16:జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి గా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్ర నేత ఒమర్ అబ్దుల్లా .. మధ్యాహ్నం సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుంటున్నట్టు ఆయన సంబంధిత ఫైలుపై సంతకం చేశారు. అనంతరం జమ్ముకశ్మీర్ ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు చెందిన సెక్రెటరీలతో ఒమర్ సమావేశమయ్యారు. జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై ఆయన వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. కాగా బుధవారంఉదయం 11.30 గంటలకు ఒమర్ అబ్దుల్లా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు.శ్రీనగర్‌లోని 'షేర్ ఇ కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్'లో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా తదితరులు ఉన్నారు

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక.. డీఏ 3 శాతం పెంపు..!



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, అక్టోబర్ 16: దీపావళి సందర్భంగా ఉద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పబోతున్నట్లు తెలిసింది. డీఏను (కరవు భత్యం) 3 శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. బుధవారం ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు ఆమోదించినట్లు తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేంద్ర కేబినెట్ నిర్ణయంతో కోటి మందికిపైగా ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. కాగా కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. కేంద్రం డీఏను సవరించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది. పెరుగుతున్న ధరలకు పరిహారంగా ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ అందజేస్తారు. ఈ ఏడాది మార్చిలో కూడా ఉద్యోగుల డీఏను, పెన్షనర్ల డీఆర్‌ను కేంద్రం 4 శాతం పెంచిన విషయం తెలిసిందే.

# రీల్స్ పిచ్చితో రిస్క్ చేశాడు..జారిపడి ప్రాణాలు కోల్పోయాడు...



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 16: ఇంటర్‌నెట్ వినియోగం ప్రతి మూలన విస్తరించింది. దీంతో ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. అంతేకాదు..సోషల్ మీడియాలో ఫేమస్ అవ్వాలనే కోరిక కూడా ప్రతి ఒక్కరిలోనూ విపరీతంగా పెరిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే..ప్రస్తుత సమాజంలో రీల్స్ ట్రెండ్ నడుస్తోంది. చిన్న పెద్ద అనే తేడా లేదు..రాత్రికి రాత్రే స్టార్స్ అయిపోవాలని ఆరాటపడుతున్నారు. ఇందుకోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఎక్కడున్నాం.. ఏం చేస్తున్నాం..? అవేవీ కూడా పట్టించుకోకుండా ప్రాణాలకు తెగించి ప్రమాదకర స్టంట్స్ చేస్తున్నారు. ఇక్కడ కూడా అదే జరిగింది. సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కోసం అత్యంత ఎత్తైన వంతెనను ఎక్కేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. పూర్తి వివరాల్లోకి వెళితే..బ్రిటన్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ సాహసోపేత స్టంట్ చేసి ప్రాణం పోగొట్టుకున్నాడు. స్పెయిన్‌లోని అత్యంత ఎత్తైన వంతెనను ఎక్కేందుకు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకోగా.. ఇప్పుడు ఆలస్యంగా బయటపడింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రిటన్‌కు చెందిన సదరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ (26) స్పెయిన్‌లోని అత్యంత పొడవైన తలావెరా డి లా రీనాలోని కాస్టిల్లా-లా కేబుల్ బ్రిడ్జ్ ఎక్కేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పట్టుకోల్పోయి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. కాగా, ఈ వంతెన ఎక్కడంపై నిషేధం ఉందని స్థానిక అధికారులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వంతెనపైకి పర్యాటకుల్ని అనుమతించడం లేదని స్పష్టం చేశారు.

# నైజీరియాలో ఘోరం.. పెట్రోల్ ట్యాంకర్ పేలి 100 మంది మృతి



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 16: ఉత్తర నైజీరియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఇంధన ట్యాంకర్ పేలి 100 మంది మృతిచెందగా.. 50 మందికి పైగా గాయపడినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. ఉత్తర జిగావా రాష్ట్రంలో రహదారిపై పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడింది. అయితే సమీపంలో ఉన్న స్థానికులకు ఈ సమాచారం తెలిసింది. రోడ్డుపై పడిన ఇంధనాన్ని సేకరించే పనిలో ఉండగా హఠాత్తుగా మంటలు అంటుకుని ట్యాంకర్ పేలిపోయింది. దీంతో భారీగా మంటలు చెలరేగి పెద్ద ఎత్తున ప్రజలు ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ట్యాంకర్ ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో హైవేపై బోల్తా పడింది. ప్రజలు పెట్రోల్ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ట్యాంకర్ ఒక్కసారిగా పేలిపోయింది. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. ట్యాంకర్‌కు దూరంగా ఉండమని ప్రజలను హెచ్చరించినప్పటికీ ఎవరూ వినిపించుకోలేదని, ఒక్కసారిగా మంటలు ఎగబడటంతో భారీగా ప్రాణనష్టం జరిగిందని అధికారులు చెప్పారు.


## ఇండియా అంటె ఇట్లుంటది మరి..

# పాకిస్తాన్ గడ్డపైనే ఆ దేశానికి జైశంకర్ వార్నింగ్ ..?



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 16: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) శిఖరాగ్ర సమావేశం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరుగుతోంది. బుధవారం ఎస్‌సీఓ మీటింగ్స్ ప్రారంభమయ్యాయి. భారతదేశం తరుపున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ నిన్న ఇస్లామాబాద్ వెళ్లారు. ఇదిలా ఉంటే, పాకిస్తాన్ గడ్డపైనే ఆ దేశానికి జైశంకర్ చురకలంటించారు. రెండు దేశాల మధ్య సరిహద్దు కార్యకలాపాలు ఉగ్రవాదం, వేర్పాటువాదంతో కూడి ఉంటే, అది ద్వైపాక్షిక వాణిజ్యం, సంబంధాలు సహాయపడేందుకు సహకరించవని అన్నారు. "అభివృద్ధి, ఆర్థిక వృద్ధికి శాంతి, స్థిరత్వం అవసరం. చార్టర్ పేర్కొన్నట్లుగా మూడు చెడులను ఎదుర్కోవడంలో దృఢంగా, రాజీపడకుండా ఉండటం దీని అర్థం. సరిహద్దు వెంబడి ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం ఉన్నట్లైయితే వాణిజ్యం, ఎనర్జీ ఫ్లో, ప్రజల మధ్య పరస్పర మార్పిడి, కనెక్టవిటిని ప్రోత్సహించదు" అని జైశంకర్ కుండబద్ధలు కొట్టినట్లుగా చెప్పారు. ఉగ్రవాదం, వేర్పాటువాదాన్ని ఎదుర్కోవడం ఎస్‌సీఓ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని ఆయన చెప్పారు. గ్లోబలైజేషన్, రీబ్యాలెన్సింగ్ ప్రస్తుత వాస్తవాలని, ఎస్‌సీఓ దీనిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీనికి నిజాయితీతో కూడిన చర్చలు, విశ్వాసం పునరుద్ధాటించడం అవసరం. ఎస్‌సీఓ మూడు చెడులను ఎదుర్కోవడంలో రాజీపడకుండా ఉండాలని సూచించారు.

# "తీవ్రంగా పరిగణించాలి".. కెనడాకు వంతపాడిన అమెరికా..



ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, అక్టోబర్ 16:భారత్, కెనడాల మధ్య దౌత్యవివాదం తారాస్థాయికి చేరింది. ఖలిస్తానీ హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత దౌత్యవేత్తల ప్రమేయం ఉందని కెనడా ఆరోపించడంతో భారత్ తీవ్రంగా ఫైర్ అయింది. కెనడాలోని తన ఆరుగురు రాయబారులను వెనక్కి పిలిచింది. ఇదే విధంగా ఇండియాలోని ఆరుగురు కెనడా రాయబారుల్ని శనివారం సాయంత్రంలోగా దేశం వదిలివెళ్లిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ పరిణామాలు ఎలాంటి మలుపు తీసుకుంటాయో అని పలు దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

ఇదిలా ఉంటే, కెనడా చేస్తున్న అసంబద్ధ ఆరోపణలకు అమెరికా వంత పాడుతోంది. నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ఏజెంట్లకు సంబంధం ఉందని కెనడా దర్యాప్తుకు సహకరించాలని అమెరికా భారత్‌ని కోరింది. మంగళవారం వాషింగ్టన్‌లో అమెరికా విదేశాంగ అధికార ప్రతినిధి మాథ్యూమిల్లర్ మాట్లాడుతూ.. కెనడా ఆరోపణల్ని "తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉంది" అని అమెరికా స్పష్టం చేసింది."కెనడా విషయానికి వస్తే ఆరోపణలు తీవ్రమైనవని మేము స్పష్టం చేశాము. కెనడాకు భారత ప్రభుత్వం సహకరించేలా చూడాలని మేము కోరుతున్నాము." అని మిల్లర్ అన్నారు. నిజ్జర్ కేసులో భారత్ ప్రమేయం ఉన్నట్లు సాక్ష్యాలు పంచుకున్నట్లు కెనడా చేసిన వాదనల్ని భారత్ గట్టిగా తిరస్కరించింది. కెనడాలో ప్రధాని జస్టిన్ ట్రూడో తన రాజకీయ లబ్ధి కోసమే, సిక్కు ఓట్ల కోసమే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని భారత్ మండిపడింది.

చూసి ముర్వాలే

## 'అఖండ తాండవం' అంటూ... సినిమా ఓపెనింగ్ లో డైలాగ్ అదరగొట్టిన బాలయ్య..



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 16: బాలకృష్ణ అఖండ 2 సినిమా ఓపెనింగ్ బుధవారం జరిగింది. బోయపాటి దర్శకత్వంలో బాలయ్య హీరోగా నాలుగో సినిమాగా రాబోతుంది అఖండ 2. నేడు తన ఇద్దరు కూతుళ్లు బ్రాహ్మణి, తేజస్విని.. చేతుల మీదుగా ఈ సినిమా పూజా కార్యక్రమం జరిగింది. బ్రాహ్మణి క్లాప్ కొట్టగా, తేజస్విని కెమెరా ఆన్ చేసారు. అయితే సినిమా ఓపెనింగ్ పూజా కార్యక్రమంలోనే బాలయ్య బాబు డైలాగ్ చెప్పి అదరగొట్టారు. అఖండ 2 సినిమాలోని డైలాగ్ ఒకటి బాలయ్య బాబు చెప్పారు. ఈ నేల అసురుడిది కాదు.. ఈశ్వరుడిది.. పరమేశ్వరుడిది.. కాదని తాకితే జరిగేది తాండవం అఖండ తాండవం అంటూ డైలాగ్ చెప్పి అదరగొట్టారు. ఇలా బయట చెప్తేనే ఈ రేంజ్ లో ఉందంటే సినిమాలో తమన్ తో ఈ డైలాగ్ ఇంకే రేంజ్ లో ఉంటుందో అని అభిమానులు అనుకుంటున్నారు. బాలయ్య డైలాగ్ మీరు కూడా వినేయండి..



## ప్రతిసారి అక్కడకు వెళ్తున్న అనసూయ.. ఇలా అయితే చాలా కష్టం అంటూ ట్రోల్స్..!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 16: టాలీవుడ్ యాంకర్ అనసూయ ఫోటోలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి.. న్యూస్ రీడర్ గా ఎంట్రీ ఇచ్చి జబర్దస్త్ యాంకర్ గా ఒక వెలుగు వెలిగిన యాంకర్.. అనసూయ. జబర్దస్త్ నుంచి బయటకొచ్చాక వరుస సినిమాలతో ఫుల్ బిజీ అయ్యింది యాంకర్ అనసూయ.. అప్పుడప్పుడు టీవీలో కనిపిస్తూన్నా అనసూయ సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు ఫోటోలు షేర్ చేస్తూ ట్రెండ్ అవుతూనే ఉంటారు.. ఇక అలానే ఇప్పుడు కూడా తన లైఫ్ స్టైల్ కు సంబంధించి కొన్ని ఫోటోలు షేర్ చెయ్యగా అవి వైరల్ గా మారాయి.



## రిలాక్స్ మోడ్‌లో పూజా హెగ్డే.. థండర్ థైస్ చూపిస్తూ గ్లామర్ ట్రీట్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 16: టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే లేటెస్ట్ ఫోటోలతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటారు. తాజాగా బీచ్‌లో రిలాక్స్ అవుతూ స్టైలిష్ లుక్‌లో ఆమె తాజాగా జరిపిన ఫోటోషూట్ ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్నది. ట్రెండ్ అవుతున్న అందాల భామ ఫోటోలపై మీరు ఓ లుక్కేయండి



## బంగారపు వర్ణం చీరలో.. బంగారంలా మెరిసిపోతూ నభా నటేష్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 16: హీరోయిన్ నభా నటేష్ తాజాగా నాగబంధం సినిమా ఓపెనింగ్ ఈవెంట్లో ఇలా చీరకట్టులో వచ్చి బంగారంలా మెరిపించింది.



బాబోయ్..

## చీరల్లో యానిమల్ భామ త్రిప్తి దిమ్రి అందాలు..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, అక్టోబర్ 16: యానిమల్ భామ త్రిప్తి దిమ్రి తాజాగా చీరల్లో వరుస ఫోటోషూట్స్ తో అలరిస్తూ అందాలు ప్రదర్శిస్తుంది.

PUBLISHED AND PRINTED BUY K.RAKESH. ON BEHALF OF RRR MEDIA ..Editor : **RR RATHNA**, Address.Patel Nagar Chowrastha, Amberpet, Hyderabad,Telangana - 500013.
**RNI NO. T/TG/2024/ 1093** ..Mobile No : 7013794396, 9949152838 ,Website : www.eyyaltynews.comEMAIL ..ramannews9@gmail.com.